పిల్లాపాపలతో నిరసన



ఉద్యోగ భద్రత, పే స్కేల్ హామీ అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు కోరారు. మంగళవారం తమ పిల్లాపాపలతో దీక్ష శిబిరంలో వారి గోడు వెల్లబోసుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీని శిబిరంలో ప్రదర్శించారు. కాగా శిబిరాన్ని విప్ ఆది శ్రీనివాస్ సందర్శించారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల అంశం సీఎం దృష్టిలో ఉందని, త్వరలోనే పరిష్కారం లభిస్తుందని హామీ ఇచ్చారు.

– సిరిసిల్ల కల్చరల్/సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల

కేంద్ర పథకాలపై అలసత్వం వీడండి

- ప్రభుత్వ ఆస్పత్రుల తీరు మారాల్సిందే..
- సిండికేట్ కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టండి
- ఎన్ని నిధులైనా తెస్తా.. అభివృద్ధిపై దృష్టిసారించండి
- అధికారులకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ఆదేశాలు
- కరీంనగర్ కలెక్టరేట్‌లో 'దిశ' మానిటరింగ్ సమావేశం



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి సంజయ్, పక్కన మేయర్ సునీల్‌రావు, కలెక్టర్లు పమేలా సత్పతి, సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, తదితరులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/కరీంనగర్: 'ఢిల్లీలో ఉన్నా.. గల్లీలో ఉన్నా కరీంనగర్ పార్లమెంట్ పరిధి ప్రజల బాగోగులే నా లక్ష్యం.. అభివృద్ధి కోసం ఎన్ని నిధులైనా తెస్తా.. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో అలసత్వం వీడాలి..' అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అధికారులకు చురుకలంటించారు. మంగళవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో కరీంనగర్, రాజన్నసిరిసిల్ల జిల్లాల అభివృద్ధి సమన్వయ మానిటరింగ్ కమిటీ(దిశ) సమావేశం రెండు గంటలపాటు వాడీ వేడిగా సాగింది. కరీంనగర్ మేయర్ సునీల్‌రావు, రెండు జిల్లాల కలెక్టర్లు పమేలా సత్పతి, సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్, కేంద్ర హోంశాఖ మంత్రి వ్యక్తిగత కార్యదర్శి అంద్ర వంశీ, కరీంనగర్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ వాజ్‌పేయ్ సహా వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. వివిధ శాఖలపై క్షుణ్ణంగా సమీక్షిస్తూ అధికారుల అలసత్వంపై కేంద్ర మంత్రి సంజయ్ అగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు రెండు కళ్లలాంటివని, వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయడం ద్వారానే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. గడువు ముగిసినా రోడ్ల పనులు ఎందుకు మందకొడిగా సాగుతున్నాయని ప్రశ్నించారు. కాంట్రాక్టర్లందరూ సిండికేటై, తమాషా చేస్తుంటే బ్లాక్ లిస్టులో ఎందుకు పెట్టడం లేదని మండిపడ్డారు. ఇప్పటి వరకు జరిగిన స్మార్ట్‌సిటీ పనులకు(రూ.398 కోట్లు) యూసీలిస్తే మిగతా రూ.70 కోట్లు మంజూరు చేయిస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల తీరు దయనీయంగా ఉందని, కేంద్రం వేల కోట్ల నిధులిస్తుంటే కాటన్, మందులు, ఎక్స్‌రే మెషిన్లు లేవని రోగులను బయటకు పంపడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై తీరు మారాలని, పేదలను ఇబ్బంది పెడితే సహించేది లేదన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ నియామకాల్లోనూ భారీ ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయని వచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో విచారణ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు.

స్టవ్‌పై మధ్యాహ్న భోజనం వండాలి..

కరీంనగర్, రాజన్నసిరిసిల్ల జిల్లాల్లో ప్రయోగాత్మకంగా గ్యాస్ స్టవ్‌పై మధ్యాహ్న భోజనం వండాలని కేంద్రమంత్రి సంజయ్ ఆదేశించారు. అలాగే, కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న రోడ్ల పనుల్లో ఏవి స్మార్ట్‌సిటీ నిధులతో చేస్తున్నారో, ఏవి నియోజకవర్గ అభివృద్ధి నిధి(సీడీఎఫ్) కింద చేస్తున్నారో గందరగోళం నెలకొందన్నారు. ఏ నిధులతో ఏ పనులు చేపడుతున్నారో వివరాలు ఇవ్వాలని పేర్కొన్నారు. కరీంనగర్ నగరంలో రోడ్ల పనులన్నీ పూర్తయిన తర్వాతే కొత్త రోడ్లు మంజూరు చేయాలని సూచించారు.

కొత్త రోడ్లకు నిధులు తెస్తా..

కొత్త రోడ్లకు అవసరమైతే కేంద్రం నుంచి మరిన్ని నిధులు తీసుకొచ్చేందుకు తాను సిద్ధంగా ఉన్నానని కేంద్ర మంత్రి సంజయ్ అన్నారు. వైద్యశాఖపై జరిగిన సమీక్షలో నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా 2022–23 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.7 కోట్లు, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.5.29 కోట్లు ఇచ్చామని తెలిపారు. వాటిని దేనికి ఖర్చు చేశారో వివరాలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటు చేసి, ఒక్కో స్కూల్‌కు కేంద్రం నుంచి నిధులిస్తే.. రెండు, మూడు పాఠశాలల్లో మినహా మిగతా చోట్ల ఆశించిన ఫలితాలు రావడం లేదన్నారు. సంబంధిత నిధులు పక్కాగా వాడుతున్నారా లేదా అని ప్రశ్నించగా అధికారుల నుంచి సమాధానం లేదు. దీంతో పనితీరు మార్చుకోవాలని, కేంద్ర నిధులు సక్రమంగా ఖర్చయ్యేలా బాధ్యతతో పని చేయాలని డీఈవోకు సూచించారు.

పథకాలపై అవగాహన కల్పించాలి..

బేటీ బచావో–బేటీ పడావో, పోషణ్ అభియాన్ సహా కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కేంద్రమంత్రి సంజయ్ సూచించారు. ఈసారి ఈ కార్యక్రమానికి సంబంధించి మంజూరు చేసిన నిధులను వేటికి ఖర్చు పెట్టారో పూర్తి వివరాలు ఇవ్వాలన్నారు. అలాగే, దివ్యాంగులకు పరికరాలు ఇచ్చేందుకు అమలు చేస్తున్న సుగమ్య భారత్ అభియాన్ కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో మంచి ఫలితాలనిస్తోందని అధికారులను అభినందించారు. ఉపాధిహామీ పథకం కింద కూలీలకు ఆశించిన సంఖ్యలో పని దినాలను ఎందుకు కల్పించలేకపోతున్నారని ప్రశ్నించారు. ఈ విషయంలో తీరు మార్చుకోవాలని సూచించారు. ఎంపీ నిధులకు సంబంధించి ఈ ఏడాది రూ.5 కోట్ల ఖర్చు విషయంలో ఇంకా అనుకున్న పురోగతి లేదన్నారు. ముఖ్యంగా రాజన్న సిరిసిల్ల జిల్లాకు ఎందుకు నిధులను పక్కాగా వినియోగించలేకపోతున్నారని అడిగారు. నాకున్న ఫీడ్ బ్యాక్ ప్రకారం.. ఎంపీ నిధులు అనేసరికి కావాలనే ఆలస్యం చేస్తున్నారని ఆరోపణలున్నాయని పేర్కొన్నారు. దీని మీద క్లారిటీ ఇవ్వాలన్నారు. రెండు జిల్లాల్లో ఎంపీ నిధులతో చేపట్టిన పనులపై తక్షణమే పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

నిధులిస్తున్నా.. ఫలితాలేవి?

సమగ్ర శిక్షా అభియాన్ కార్యక్రమాలకు కేంద్రం పెద్ద ఎత్తున నిధులిస్తున్నా.. ఆశించిన ఫలితాలు రావడం లేదని కేంద్రమంత్రి సంజయ్ అన్నారు. ఈ ఏడాది రాజన్నసిరిసిల్ల జిల్లాకు రూ.28.62 కోట్లు ఇస్తే రూ.8.55 కోట్లే ఖర్చు చేశారు.. మిగతావి ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఆ నిధులు మీ వద్దే ఉన్నాయా? డైవర్ట్ చేశారా? రాష్ట్ర వాటా నిధులు విడుదలయ్యాయా.. వివరాలన్నీ పంపాలని ఆదేశించారు. ఎస్‌ఎస్‌ఏ కాంట్రాక్టు ఉద్యోగులకు సక్రమంగా వేతనాలిస్తున్నారా? వాళ్లెందుకు ఆందోళనలు చేస్తున్నారని ప్రశ్నించారు. వారికి నచ్చజెప్పాలని సూచించారు. పీఎంజీఎస్‌వైలో భాగంగా రాజన్నసిరిసిల్ల జిల్లాకు గత ఆర్థిక సంవత్సరంలో 12 రోడ్లు, కరీంనగర్‌కు 16 రోడ్లు మంజూరు చేస్తే రెండు ప్రాంతాల్లో కలిపి ఒకటి చొప్పున రోడ్ల పురోగతి మాత్రమే ఉందని, మిగతావి ఎందుకు ఆలస్యమవుతున్నాయని ఆరా తీశారు.

రైతుల సంఖ్యకు అనుగుణంగా సంఘాలు

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్లకల్చరల్: జిల్లాలోని రైతుల సంఖ్యకు అనుగుణంగా పీఏసీఎస్(ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు)లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సందీపకుమార్ ఝా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కేంద్ర ప్రభుత్వ పథకం సహకార్స్ సమృద్ధిపై అదనపు కలెక్టర్ భీమ్యా నాయక్, కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా నాబార్డ్ డీడీ ఎం దిలీప్ పథకం గురించి వివరించారు. జిల్లాలో మొత్తం 24 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలున్నాయని, రైతులకు సంబంధించి అన్ని సేవలనూ సంఘాల్లోనే మరింత మెరుగ్గా అందేలా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి రామకృష్ణ, డీఆర్డీవో శేషాద్రి, వ్యవసాయ అధికారి అఫ్జల్‌బేగం, ఉద్యానవన అధికారి వసంతలక్ష్మి, పౌరసరఫరాల శాఖ మేనేజర్ రజిత, మత్స్యశాఖ అధికారి సౌజన్య, కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణరావు, విజయ డెయిరీ డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, జిల్లా ఆడిట్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- విప్ ఆది శ్రీనివాస్



నిరసన తెలుపుతున్న విప్ ఆది శ్రీనివాస్, నాయకులు

సిరిసిల్లకల్చరల్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను విప్ ఆది శ్రీనివాస్ ఖండించారు. అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన అంబేడ్కర్ సమ్మాన్ మార్చ్‌లో పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర మంత్రి వ్యాఖ్యలను నిరసిస్తూ బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలు దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నా స్పందించడం లేదని బీజేపీ తీరును దుయ్యబట్టారు. కాంగ్రెస్ నిరసనలతో కలెక్టర్ ద్వారా రాష్ట్రపతికి ఈ విషయాన్ని నివేదించనున్నట్లు పేర్కొన్నారు. బలహీనవర్గాల వారికి దైవ సమానుడైన అంబేడ్కర్ గొప్ప రాజ్యాంగాన్ని దేశానికి అందించారని గుర్తు చేశారు. అలాంటి మహనీయుడిపై అమిత్‌షా అహంకారపూరిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. దేశ సంపదను బీజేపీ అంబానీ, అదానీలకు దోచి పెడుతోందని ఆరోపించారు. మణిపూర్‌లో హక్కులు కోల్పోతున్న ప్రజల గురించి పట్టించుకోని మోదీ, అమిత్‌షా అంబేడ్కర్‌పై నోరు పారేసుకుంటున్నారని, ఇప్పటికైనా అమిత్‌షాను మోదీ వెంటనే మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

నివాసం లేని వారి ఇళ్లు రద్దు



గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని కేసీఆర్ ఆత్మగౌరవ సముదాయం(డబుల్ బెడ్రూం)లో ఇళ్ల పట్టాలు తీసుకొని, నివాసం ఉండని వారి ఇళ్లను రద్దు చేయాలని అధికారులు నిర్ణయించారు. మంగళవారం ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీలో నిర్వహించిన గ్రామసభలో అధికారులు పలు నిర్ణయాలు తీసుకున్నారు. మండల కేంద్రం శివారులోని డబుల్ బెడ్‌రూం కాలనీలో 167 ఇళ్లను నిరుపేదలకు గత ప్రభుత్వం అందజేసింది. అయితే అందులో దాదాపు 22 మంది ఇళ్లకు తాళాలు వేసి వేరే చోట నివాసం ఉంటున్నట్లు గ్రామపంచాయతీ, మండల స్థాయి అధికారులు ఇటీవల తనిఖీ చేసి గుర్తించారు. కొంతమంది తమకు వచ్చిన ఇళ్లను అద్దెకు ఇచ్చినట్లు తెలుసుకున్నారు. ఈ నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. గ్రామసభకు హాజరుకావాలని ఇళ్ల లబ్ధిదారులకు నోటీస్ ఇచ్చినా.. వారు మంగళవారం నాటి సభకు రాలేదు. దీంతో అధికారులు స్థానికంగా ఉండని వారి జాబితాను సిద్ధం చేసి ఇళ్లను రద్దుచేయాలని నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో డీటీ సత్యనారాయణ, ఆర్‌ఐ శ్రావణ్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైక్ కొనివ్వలేదని బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

మెట్‌పల్లిరూరల్: బైక్ కొనివ్వలేదనే కారణంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు మెట్‌పల్లి ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. మెట్‌పల్లి మండలం వేంపేటకు చెందిన మామిడాల రణధీర్ (22) హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. ఇటీవల ఓ ఫంక్షన్ నిమిత్తం ఇంటికి వచ్చిన కిరణ్ బైక్ కొనివ్వాలని ఇంట్లో తరచూ గొడవ చేస్తున్నాడు. తల్లిదండ్రులు కొనివ్వకపోవడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈనెల 22న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు కిరణ్‌ను మెట్‌పల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. రణధీర్ తండ్రి ప్రకాశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైలుకింద పడి వృద్ధుడు..

గంగాధర: గంగాధర గ్రామానికి చెందిన పులిచర్ల భూమయ్య (65) మంగళవారం సాయంత్రం గ్రామ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రామగుండం నుంచి నిజామాబాద్ వెళ్తున్న ప్యాసింజర్ రైలు కింద తలపెట్టి ఆత్మహత్య చేసుకోవడంతో తల, మొండెం వేరుగా పడ్డాయి. స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

వాగులో పడి మహిళ మృతి

వీణవంక(హుజూరాబాద్): మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన మామిడి రాజేశ్వరి(55) మూడురోజుల క్రితం ప్రమాదవశాత్తు మానేరు వాగులో పడి గల్లంతు కాగా, మంగళవారం మృతదేహం లభ్యమైంది. పోలీసుల వివరాలు.. రాజేశ్వరి కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేక ఇబ్బంది పడుతుంది. ఈ క్రమంలో ఇంట్లో నుంచి వెళ్లి వాగులో ప్రమాదవశాత్తు పడి నీట మునిగింది. మృతురాలి తల్లి కనుకమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు..

రాయికల్: చెట్ల కొమ్మలు క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి రైతు దుర్మరణం పాలైన ఘటన మండలంలోని అల్లీపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై సుధీర్‌రావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గొల్లపల్లి నర్సయ్య (56)కు రెండెకరాల పొలం ఉంది. కొద్ది దూరంలో విద్యుత్ స్తంభం ఉండడంతో మోటార్ కనెక్షన్ కోసం వైరును చెట్ల కొమ్మలతోపాటు అక్కడక్కడ కర్రలు పాతుకున్నాడు. వైరు వెళ్తున్న ప్రాంతమంతా చిత్తడిగా మారడంతో తొలగించేందుకు మంగళవారం పొలానికి వెళ్లాడు. పొదలను తొలగిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు వైర్‌కు తగిలి షాక్‌కు గురై అక్కడిక్కడే చనిపోయాడు. నర్సయ్యకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. నర్సయ్య భార్య లింగవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చిట్టీల వ్యాపారి పరార్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని శివాలయం వీధి ప్రాంతానికి చెందిన ఓ చిట్టీ వ్యాపారి దాదాపు రూ.3 కోట్లతో పరారయ్యాడు. బాధితులు మంగళవారం ఎస్సై లక్ష్మణ్‌రావును ఆశ్రయించారు. కొన్నేళ్లుగా చిట్టీ వ్యాపారం చేస్తూ నమ్మకంగా ఉన్న హనుమాన్‌ప్రసాద్ అనే వ్యాపారి.. కొద్ది రోజులుగా కనిపించకుండా పోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు బాధితుల నుంచి ఫిర్యాదు అందిందని, ఇప్పటివరకు రూ.కోటి 60లక్షల వివరాలు అందాయని ఎస్సై తెలిపారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముందని, విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని ఎస్సై వివరించారు.

నేరాలపై నిశితంగా దర్యాప్తు

- మహిళల భద్రతకు ప్రాధాన్యం
- నిరుద్యోగులకు బాసటగా ఉంటాం
- ఎస్పీ అఖిల్ మహాజన్


మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: జిల్లాలో నేరాలు చేసినవారికి శిక్ష అములులో అత్యంత నిశితంగా పని చేస్తున్న పోలీసులు సక్సెస్ అయ్యారన్న అభిప్రాయాలున్న దానికి అనుగుణంగానే నేరాలు పెరిగినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడించిన గణాంకాల ఆధారంగా తెలుస్తుంది. 2024లో శాంతి భద్రతల కోసం తీసుకున్న చర్యలు, నేరాలు జరిగిన తీరు వాటిని నియంత్రించడానికి ఎంచుకున్న విధి విధానాలపై జిల్లా పోలీసు కార్యాలయంలో వివరాలు వెల్లడించారు.

నిరుద్యోగుల బాసటగా..

జిల్లాలోని నిరుద్యోగ యువతను ఉద్యోగాల వైపు మళ్లించడానికి ఉచిత శిక్షణ అందించారు. దాదాపు 1,100 మంది ఉద్యోగాలకు వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. వాహనాలు నడిపే వారికి ప్రభుత్వ నిర్ణీత ఫీజుతో డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించడం, పలుమార్లు ఆరోగ్య శిబిరాలను నిర్వహించామని ఎస్పీ వివరించారు.

మహిళలకు భద్రత కల్పించేందుకు..

జిల్లాలో మహిళలు, విద్యార్థినులకు భద్రత కల్పించడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కళాశాలలు, పాఠశాలల ఆవరణలో షీటీం పోలీసులు నిఘా వేసి దాదాపు 30 మందిని అదుపులోకి తీసుకుని వారికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. మహిళలు, విద్యార్థినులకు మరింత చేరువగా కావాలని 'పోలీసు అక్క' పేరిట పోలీసు స్టేషన్‌లో ఒక మహిళా కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అలాగే సైబర్ నేరాలపై జిల్లా పోలీసుల నిఘా సత్ఫలితాలు ఇచ్చింది. కాంబోడియా కేంద్రంగా జరిగిన సైబర్‌నేరాన్ని జిల్లా పోలీసులు ఛేదించడంతో దేశ స్థాయిలో చర్చ జరిగింది.

యువతను సన్మార్గంలో పెట్టేందుకు..

జిల్లాలోని యువత గంజాయికి బానిస కాకుండా ఉండేందుకు నిత్యం తనిఖీలు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. అలాగే మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణం అవుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లాలో రెండు దఫాలుగా మైనర్ డ్రైవింగ్‌పై కఠినంగా వ్యవహరించి వాహనాలు నడిపిన వారిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. దాదాపు 800 మంది మైనర్లకు వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించామన్నారు. 2025లో విజిబుల్ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. దీనిలో భాగంగా ప్రతి ఊరిలో విలేజ్ పోలీసు ఆఫీసర్ ఉండేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పాత సంవత్సరం వీడ్కోలు అని, కొత్త సంవత్సరం సంబరాలు అని చట్టాన్ని అతిక్రమించి కేసుల్లో ఇరుక్కోవద్దని సూచించారు. కుటుంబ సభ్యులతో సంతోషంగా సంబరాలు జరుపుకోవాన్నారు.

కోర్టు శిక్ష పడిన తీరు..

జైలు శిక్ష	2023	2024
జీవితకాలం	3	3
5 నుంచి 10 ఏళ్లు	1	4
3 నుంచి 5 ఏళ్లు	3	10
1 నుంచి 3 ఏళ్లు	24	40
ఏడాది లోపు	27	20

రెండేళ్లలో కేసులు ఇలా..

సంవత్సరం	రోడ్డు ప్రమాదాలు	పోక్సో	మర్డర్లు	మోసాలు
2023	218	38	12	329
2024	294	47	13	443

నేటి నుంచి ఎస్సారెస్పీ నీటి విడుదల


జిల్లాకు సాగు నీరు అందించే కాకతీయ కాలువ

- ఆన్, ఆఫ్ పద్ధతిలో సాగునీరు
- ఏప్రిల్ వరకు చివరి తడి

జగిత్యాలఅగ్రికల్చర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు వరప్రదాయిని అయిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు ఈనెల 25 నుంచి సాగు నీటిని విడుదల చేస్తున్నారు. ఎల్‌ఎండీ ఎగువ ఆయకట్టుకు నీటి సరఫరాకు ప్రాజెక్టు అధికారులు ప్రణాళిక రూపొందించారు. నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలోని 4.50 లక్షల ఎకరాలకు ఆన్, ఆఫ్ పద్ధతిలో (వారం విడిచి వారం) విడుదల చేయనున్నారు. కాకతీయ కాలువ ద్వారా జోన్-1 ఆయకట్టు (డీ-5 నుంచి డీ-53 వరకు)కు వారం రోజులు, జోన్-2 ఆయకట్టు (డీ-54 నుంచి డీ-94 వరకు)కు వారం రోజులు సరఫరా చేయాలని నిర్ణయించారు. జోన్-2కు ఈనెల 25న జోన్-1కు జనవరి 2 నుంచి నీటిని విడుదల చేయనున్నారు. ఏప్రిల్ 8వ తేదీ వరకు పంటలకు సాగు నీరు అందించనున్నారు. కాకతీయ కాలువ ద్వారా మూడు నుంచి ఐదువేల క్యూసెక్కుల సామర్థ్యం ఉండేలా చూడనున్నారు. లక్ష్మీ ప్రధాన కాలువకు కూడా సాగు నీటిని విడుదల చేస్తున్నారు.

ఎస్సారెస్పీలో 80.053 టీఎంసీలు

ఎస్సారెస్పీలో ప్రస్తుతం నీటి నిల్వ 1090.90 అడుగులతో 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి తాగునీటి అవసరాలకు కోరుట్ల, జగిత్యాల పట్టణాలకు 61 క్యూసెక్కులు, ఆదిలాబాద్, నిర్మల్ పట్టణాలకు 63 క్యూసెక్కులు, ఆర్మూర్, నిజామాబాద్, కామారెడ్డి పట్టణాలకు 107 క్యూసెక్కుల చొప్పున నీరు విడుదల చేస్తున్నారు.

చివరి ఆయకట్టుకూ చేరేలా..

ఎస్సారెస్పీ నీరు కాలువ చివరి భూములకు చేరేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. కాలువలపై లస్కర్లు, అధికారులు కాలువలను పరిశీలించనున్నారు. అలీసాగర్, గుత్పా వంటి ఎత్తి పోతల పథకాలకు కూడా వారబంధీ పద్ధతిలోనే నీటిని సరఫరా చేయనున్నారు. కాలువలకు గండ్లు పడితే వెంటనే మరమ్మతు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


జగన్ మృతదేహం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాగట్లపల్లి శివారులోని మొండిచింత మూలమలుపు వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు.. ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన సబ్బని జగన్ (40) సోమవారం రాత్రి బైక్‌పై ఎల్లారెడ్డిపేటకు వచ్చి తిరిగి వెళ్తున్నాడు. రాగట్లపల్లి శివారులోని మొండిచింత మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య దివ్య.. తన భర్త బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతిచెందినట్లు ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వైన్స్‌పై ఫిర్యాదులు.. అధికారుల విచారణ


వైన్స్ వద్ద కొలతలు తీస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని మొదటి బైపాస్‌రోడ్డులో గల వైన్స్‌పై స్థానికుల ఫిర్యాదుతో అబ్కారీ శాఖ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. నివాసాల మధ్య వైన్స్ ఉండడంతో కాలనీలోని మహిళలు, స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు ఇటీవల పలు ఫిర్యాదులు వెళ్లాయి. వీటిపై స్పందించిన అబ్కారీ సీఐ శ్రీనివాస్ వైన్స్ వద్ద విచారణ చేపట్టారు. రోడ్డుకు, వైన్స్‌షాప్‌నకు మధ్య దూరాన్ని కొలతలు వేశారు. ఈ సందర్భంగా అక్కడికి చేరుకున్న స్థానికులు సీఐతో మాట్లాడుతూ, నివాసాల మధ్య ఉన్న మద్యం దుకాణాన్ని తరలించాలని కోరారు.

దుబ్బపల్లిలో లారీ ఢీకొని ఒకరు..


పొనగంటి సునీల్(ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): దుబ్బపల్లి గ్రామ శివారులోని రాజీవ్ రహదారిపై మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న సంఘటనలో రామగుండం ప్రాంతానికి చెందిన అప్సరుద్దీన్(31)మృతి చెందాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. అప్సరుద్దీన్ ద్విచక్ర వాహనంపై కరీంనగర్ వెళ్తుండగా.. దుబ్బపల్లి వద్ద తొలుత కారు ఢీకొంది. దీంతో అతడు కింద పడగా వెనకాల కరీంనగర్ వైపుకే వెళ్తున్న లారీ అప్సరుద్దీన్ పైకి ఎక్కింది. దీంత అతడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు.

రైలు కింద పడి యువకుడు..

రామగుండం: అంతర్గాం మండలం పెద్దంపేట రైల్వేగేట్ వద్ద గోదావరిఖని పవర్‌హౌస్ కాలనీకి చెందిన పొనగంటి సునీల్(33) సోమవారం అర్ధరాత్రి రైలు కిందపడి మృతిచెందాడు. ఈమేరకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారని జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి గంగారపు తిరుపతి మంగళవారం తెలిపారు. మృతుడు అవివాహితుడు. అతడికి సోదరుడు రవికుమార్, సోదరి లావణ్య, బావ సురేందర్ ఉన్నారు. మృతికి గల కారణాలపై దర్యాప్తు చేపడుతున్నామని తిరుపతి పేర్కొన్నారు.

అటవీభూమిని సాగుచేసిన వ్యక్తిపై కేసు

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం సనుగుల అటవీ ప్రాంత భూమిని సాగు చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. అటవీశాఖ అధికారుల కథనం మేరకు.. సనుగులకు చెందిన పిట్టల లచ్చయ్య గతంలోనే అటవీ భూమిని చదును చేసి పత్తి వేశాడు. అటవీ భూమి సాగు చేస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించినా వినకుండా, మళ్లీ పత్తి తీసేసి వేరే పంట సాగు చేసేందుకు మంగళవారం కేజీవీల్స్ ట్రాక్టర్‌తో దున్నుతుండగా సనుగుల బీట్ ఆఫీసర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. లచ్చయ్యతో పాటు ట్రాక్టర్ డ్రైవర్ ఎల్లయ్యపై కేసు నమోదు చేసినట్లు వేములవాడ ఫారెస్టు రేంజ్ అధికారి ఖలీలోద్దీన్ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి


గాలవ్వ మృతదేహం

ఇల్లంతకుంట(మానకొండూర్): అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు యత్నించగా, చికిత్స పొందుతూ మృతిచెందింది. ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాలు.. మండలంలోని పెద్దలింగాపురం గ్రామానికి చెందిన బండ గాలవ్వ(80) ఏడేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతుంది. అనారోగ్యం భరించలేక సోమవారం వేకువజామున తన వద్ద ఉన్న బీపీ గోలీలు, గుండెకు సంబంధించిన గోలీలు అధికంగా మింగడం వల్ల వాంతులు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఆమె కొడుకు వెంటనే సిద్ధిపేట ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. మృతురాలి కొడుకు రామచంద్రం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మల్యాల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతిచెందింది. మల్యాల మండలం బల్వంతాపూర్ గ్రామానికి చెందిన నాగుల మొండయ్య, నర్సవ్వ భార్యాభర్తలు. 20 రోజుల క్రితం ఇద్దరూ కలిసి కొండగట్టుకు వెళ్తున్నారు. ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి పడడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. నర్సవ్వ (60) కోమాలోకి వెళ్లింది. కరీంనగర్ ఆస్పత్రిలో ఆమెకు చికిత్స అందిస్తున్నారు. వైద్యులు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. మంగళవారం మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు.

పుష్ప-2 సినిమాపై ఫిర్యాదు

సిరిసిల్లక్రైం: వరుస వివాదాల్లో చిక్కుతున్న పుష్ప-2 సినిమాలోని సన్నివేశాలు పోలీసులను కించపరిచేలా ఉన్నాయని, సమాజానికి హాని కలిగించే తీరుగా ఉన్నాయని సిరిసిల్ల టౌన్ కాంగ్రెస్ నాయకులు పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. శాంతిభద్రతలకు కాపాడే పోలీసులను కించపరిచేలా ఉన్న సీన్స్‌ను తొలగించాలని, నటుడు అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్, నిర్మాణ సంస్థపై కేసు నమోదు చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో గడ్డం కిరణ్, రెడ్డిమల్ల భాను ఉన్నారు.

వేధింపులపై ముగిసిన విచారణ!

- సీల్డ్ కవర్‌లో నివేదిక పంపిన ప్రత్యేక కమిటీ సభ్యులు

కరీంనగర్: తాను చదివే కాలేజీకి చెందిన ఉద్యోగి తనను లైంగికంగా వేధిస్తున్నాడంటూ ఓ విద్యార్థిని జాతీయ మహిళా కమిషన్, ఎస్సీ,ఎస్టీ కమిషన్, శాతవాహన వర్సిటీ అధికారులకు చేసిన ఫిర్యాదుపై విచారణ ముగిసింది. వివిధ కమిషన్లు, యూనివర్సిటీ ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదుల మేరకు అంతర్గతంగా పలువురు ప్రొఫెసర్లతో అంతర్గత విచారణ కమిటీని ఇటీవల యూనివర్సిటీ నియమించింది. ఈ కేసు జిల్లాలో సంచలనం కావడం, పోలీసు కేసు కూడా నమోదవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో కమిటీ విచారణ పూర్తవడం ఆసక్తి రేపుతోంది. ఇటీవల ఫిర్యాదు చేసిన మహిళా విద్యార్థినిని కమిటీ సభ్యులు పలుమార్లు విచారించారు. అదే సమయంలో కమిటీ సభ్యులు సదరు కాలేజీలో పర్యటించి, సిబ్బందిని, తోటి విద్యార్థులను విచారించినట్లు తెలిసింది. విచారణలో తాము సేకరించిన వివరాల ఆధారంగా రూపొందించిన నివేదికను సీల్డ్ కవర్‌లో ఉన్నతాధికారులకు పంపించారు.

కక్ష సాధింపు చర్యనా?

ఫిర్యాదు చేసిన విద్యార్థిని వెనక ఎవరు ఉన్నారన్నది ఇప్పుడు చర్చానీయాంశంగా మారింది. అదే కళాశాలకు చెందిన ఓ సీనియర్ ఉద్యోగి సదరు విద్యార్థినిని ఈ వ్యవహారంలో తప్పుదోవ పట్టించినట్లు ప్రచారం జరుగుతోంది. కేవలం తాను కక్ష సాధించే క్రమంలో ఈ వ్యవహారంలో కలగజేసుకుని, జాతీయస్థాయికి పెంచి విషయాన్ని భూతద్దంలో చూపినట్లు సమాచారం. అదే సమయంలో ఇది రెండు కాలేజీల మధ్య జరుగుతున్న ఆధిపత్య పోరా? లేక ఇద్దరు వ్యక్తుల మధ్య జరుగుతున్న కక్ష సాధింపు చర్యనా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విచారణ కమిటీ వచ్చిన సమయంలో ఆ తరగతిలోని మిగిలిన విద్యార్థులంతా కూడా కమిటీకి తమ తమ నివేదికలను లిఖిత పూర్వకంగా ఇచ్చారని తెలిసింది. అందులో వారు ఏం రాశారు? అన్నది ఆసక్తికరంగా మారింది. ఇదంతా ఇటీవలే ప్రభుత్వ ఉద్యోగానికి ఎన్నికైన వ్యక్తికి ఎలాగైనా ఆ ఉద్యోగం రానీయకుండా కొందరు పన్నిన కుట్రగా కళాశాల సిబ్బంది అభివర్ణిస్తున్నారు.

సాగునీటి కోసం రైతు ఆత్మహత్యాయత్నం

- అడ్డుకున్న పోలీసులు


పురుగు మందు డబ్బాతో యువకుడు


పవర్ ప్లాంట్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

మంథని: సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుతో నీళ్లు అందక పంటలు నష్టపోతున్న తమకు న్యాయం చేయాలని పెద్దపల్లి జిల్లా మంథని మండలం పోతారం గ్రామానికి చెందిన రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు. ఎస్సారెస్పీ కాలువ పరిధిలోని ఎల్-6 కాలువను ఆక్రమించి పోతారంలో సోలార్ పవర్ ప్లాంట్ నిర్మించారని, దీనిద్వారా పంటలకు సాగు నీరు రావడం లేదని ఆవేదన చెందారు. ఈ విషయంపై పలుమార్లు అధికారుల ఎదుట తమగోడు వెళ్లబోసుకున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. దీంతో తాము హైకోర్టును ఆశ్రయించామని తెలిపారు. తమకు న్యాయం చేయాలని, కాలువను పునరుద్ధరించాలని కోర్టు ఉత్తర్వులు జారీచేసిందని వారు గుర్తుచేశారు. అయినా, సోలార్ పవర్ ప్లాంట్ కంపెనీ నిర్వాహకులు కోర్టు ఆదేశాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తద్వారా సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్న క్రమంలో ఓ యువ రైతు పురుగుల మందు డబ్బా పట్టుకొని మందు తాగేందుకు యత్నించాడు. అప్పటికే అక్కడకు చేరుకున్న పోలీసులు రైతును అడ్డుకొన్నారు. ఆ తర్వాత ఆయనను అదుపులోకి తీసుకుని సర్దిచెప్పడంతో శాంతించాడు. ఈ విషయంపై నీటిపారుదల శాఖ అధికారులతో పోలీసులు ఫోన్‌తో మాట్లాడారు. హైకోర్టు తీర్పు ఆధారంగా కాలువను 20 రోజుల్లో పునరుద్ధరిస్తామని ప్లాంట్ సైట్ ఇన్‌చార్జి చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

ఎమ్మెల్యేను కలిసిన గెజిటెడ్ ఉద్యోగుల సంఘం


ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో గెజిటెడ్ ఉద్యోగుల సంఘం కార్యవర్గం

సిరిసిల్లకల్చరల్: తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ప్రతినిధులు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులకు ఇతర కార్యవర్గ ప్రతినిధులుకు శుభాకాంక్షలు తెలిపారు. సంఘం అధ్యక్షుడు సమరసేన, ఉపాధ్యక్షులు జానకి, కార్యదర్శి జబీ, సభ్యులు శేఖర్, శ్రావ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయాలకు టీచర్లుగా పదోన్నతి

సిరిసిల్లకల్చరల్: సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసీడీఎస్) సిరిసిల్ల ప్రాజెక్ట్ పరిధిలో ఐదేళ్ల పని అనుభవం, ఇంటర్మీడియట్ విద్యార్హత గల 12 మంది అంగన్‌వాడీ ఆయాలకు టీచర్లుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు మంగళవారం టీచర్లుగా ఎంపికైన వారికి విప్ ఆది శ్రీనివాస్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నియామక పత్రాలు అందజేసినట్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఉమారాణి తెలిపారు. పదోన్నతులు పొందినవారిలో వేముల స్వప్న (బందనకల్), సుంచు లత (ముస్తాబాద్), చిట్టంపల్లి శ్రావణి, సరాని సౌజన్య, తుమ్మల రేఖ (గంభీరావుపేట), గడ్డి వసంత (బొప్పాపూర్), ఎస్ అస్పియా (కోరుట్లపేట), జక్కని అనిత (పత్తిపాక వీధి), గుర్రాల వందన (ఇల్లంతకుంట), బాస నాగరాణి (కందికట్కూర్), బెజ్జంకి శ్వేత (ఓబులాపూర్) ఉన్నారు. ఈ సందర్భంగా నూతన టీచర్లు కలెక్టర్, డీడబ్ల్యూవోకు కృతజ్ఞతలు తెలిపారు.

ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఆహార పదార్థాల తయారీ, విక్రయ కేంద్రాల్లో ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించేలా అధికారులు చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఏవో రాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమణ మట్లాడుతూ, క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగల నేపథ్యంలో తినుబండారాల తయారీ, విక్రయ కేంద్రాల్లో కృత్రిమ రసాయనాలు, కలర్స్, ఫ్లేవర్స్, జెల్లీలు, సాస్‌లు, ఎసెన్స్ కలపకుండా ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. బేకరీలు, రెస్టారెంట్లు, హోటల్స్, స్వీట్‌షాపులు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు నిబంధనలు పాటించాలని కోరారు. అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, కార్యదర్శి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి అనూషతో ఫోన్‌లో వివరించగా, ఆమె స్పందిస్తూ చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాయకులు అన్నల్దాస్ గణేశ్ పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి


మాట్లాడుతున్న రంజిత్

వేములవాడఅర్బన్: వేములవాడలోని బీసీ విద్యార్థి వసతి గృహాన్ని ఏబీవీపీ రాష్ట్ర విద్యార్థి వసతి గృహాల కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వసతి గృహానికి రహదారి లేక, ఇక్కడి నుంచి పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలన్నారు. గురుకుల పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించి, వసతిగృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రాజు, కార్తీక్, రామ్‌చరణ్, హరినాథ్, అభినయ్ తదితరులు ఉన్నారు.

పలు పరీక్షలు వాయిదా

కరీంనగర్ సిటీ: శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని పీజీ, ఎంబీఏ, ఎంసీఏ మూడో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీసెట్, యూజీ సెట్ ఉన్నందున పరీక్షలు వాయిదా వేశామని, తిరిగి నిర్వహించే తేదీలను త్వరలో తెలియజేస్తామని తెలిపారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి జూడో పోటీలు


జిల్లా స్థాయి జూడో పోటీల్లో విజేతలు

- రాష్ట్ర స్థాయి పోటీలకు 20 మంది ఎంపిక

బోయినపల్లి(చొప్పదండి): జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో బోయినపల్లి మండలం నీలోజిపల్లి గ్రామ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం జిల్లా స్థాయి జూడో పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. జిల్లాలోని పలు గ్రామాలకు చెందిన సుమారు వంద మంది పోటీల్లో పాల్గొన్నారు. సబ్ జూనియర్ నేషనల్ క్యాడెట్ జూడో, సీనియర్ పురుషులు, మహిళల విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ప్రతిభ కనబర్చిన సుమారు 20 మంది క్రీడాకారులు ఈ నెల 29, 30వ తేదీలలో కరీంనగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు జూడో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కాసారపు తిరుపతి, ప్రధానకార్యదర్శి తిప్పారపు సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై పృథ్వీధర్‌గౌడ్, ఎనదేవి ప్రసాద్, సీహెచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.